# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 36 సంచిక 10
పేజీలు 40
జులై 2017

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ ,
A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ................................................2
శ్రీబాబూజీ ఉవాచ........................................ 3
అమ్మమాట.................................................. 6
పంచముడు ........................ ........................ 8
వైరాగ్యం ...................................................9
అంజలి ................................................ 10
సమర్థ సద్గురు జీవిత
చందాదారులకు విన్నపము ............11
త్రిపురా రహస్యం ........................................ 13
వెలుగు రవ్వలు ..........................................15
పరాభక్తి ....................................................17
శరణాగత భక్తుడు .......................................19
ఫకీరు ఆస్తిక్య బుద్ధి ...................................... 20
ముండకోపనిషత్తు ........................................ 22
ఎవరు అధికులు?.........................................24
యోగవాశిష్ఠము ........................................ 26
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు...........................28
పరిప్రశ్న ....................................................29
కుమారస్వామిని నాగదేవతగా
ఎందుకు పూజిస్తారు?........31
శ్రీకృష్ణకర్ణామృతము.......................................32
భ్రమర కీటక న్యాయం ......................................33
నిజమైన చదువు ...........................................34
పరమానందయ్య శిష్యులు ........ ................ 35
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...... 37
విష్ణు కథలు- మీరాబాయి..............................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

**ఆత్మానం అరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిం ।**
**జ్ఞాన నిర్మథ నాభ్యాసాత్ పాశం దహతి పండితః ॥**

పరమాత్మ దేహమనోబుద్ధుల ద్వారా అభివ్యక్తమైనా ప్రకృతి ద్వారా అభివ్యక్తమైనా విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడుగా వ్యవహరించు జీవుడై, దేహ పరిధిలో దుఃఖదోషాదులను, మానసికంగా విక్షేపాదులను, బుద్ధిలో అశాంతిని అనుభవించునట్లు గోచరిస్తున్నాడు.

జీవుని స్థితి దేహమనోబుద్ధుల స్థితిగతులపై ఆధారపడి వుండటం అతి సహజమైనదే కదా! అయితే సాధకుడు జీవాత్మ భావాన్ని క్రింది అరణిగాను, ప్రణవమును ఉత్తరారణిగాను చేసి, జ్ఞాన మార్గంలో మథనం చేసే అభ్యాస క్రియ ద్వారా సమస్త బంధములను దహింపచేసుకోవచ్చు అనేదే సారాంశము.

ప్రణవము పరమాత్మకు ప్రతీక కాబట్టి సాధకుడు ప్రణవోపాసన ద్వారా జ్ఞాన మథనము జరిగి ఉద్భవించే ధ్యానాగ్ని, అంతఃకరణలోని మాలిన్యాన్ని దగ్ధం చేసి, స్వస్వరూపమైన ఆత్మతత్త్వాన్ని అనుభవించ గలుగుతున్నాడు.

సాధకుడు సదా పరిణామం చెందే ప్రకృతి సహజమైన దుఃఖాలను అనుభవిస్తూ బద్ధ జీవుడుగా జీవిస్తున్నాడు. ఈ మోహాంధకారాన్ని దాటి ఆత్మానుభూతిని పొందలేకున్నాడు. జ్ఞాన మథన క్రియ ద్వారా జీవుడు మేల్కొని జ్ఞానాగ్ని చేత బంధములన్నీ దగ్ధమై తన సహజస్థితిని గుర్తిస్తున్నాడు.

ఓంకారోపాసన లేక ప్రణవోపాసన జీవ భ్రాంతిని తొలగిస్తుంది. సాధకుడు యదార్థంగా చైతన్యవంతుడే. సాధకుని మనస్సు ప్రాపంచిక వ్యవహారాలను విషయాదులను గ్రహించి భావన చేయగలుగుతోంది. బుద్ధి వాటిని విశ్లేషించి తగిన విధంగా నిర్ణయించ గలుగుతోంది. సాధకుడు జ్ఞానవంతుడే, అయితే మనస్సు బుద్ధి అనంత తత్త్వముపైన కేంద్రీకరించినట్లయితే ఆత్మజ్ఞాన సంపన్నుడౌతాడు. యజ్ఞ యాగాదులలో కొయ్య ముక్కల అగ్నిమథనం ద్వారా అగ్నిని పుట్టించి నట్లు జీవుడు ప్రణవోపాసన ద్వారా జ్ఞానాగ్నిని ఉద్భవింపజేసుకుని అంతఃకరణ శుద్ధి చెందితే ఆత్మానుభూతి తథ్యం. అయితే అది సద్గురు పర్యవేక్షణలో మాత్రమే సాధ్యం అని గుర్తించాలి.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహారాజ్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "అయమాత్మాబ్రహ్మ అంటే ఏమిటి?" అని శ్రీ హనుమాయమ్మగారిని ప్రశ్నించారు. ఆవిడ సమాధానము చెబుతూ "సమస్త జగత్తునీ ప్రకాశింపచేసేది ఆ పరమాత్మ వస్తువే అని అర్థం" అని చెప్పారు. శ్రీ బాబూజీ మహారాజ్ మాట్లాడుతూ "అంతటా ఉన్నది ఒక్కటేనా? లేక జగత్తు అనేది ఒకటి, దానిని ప్రకాశింపచేసేది మరొకటి వేరు వేరుగా ఉన్నాయా? గురుగీత శ్లోకంలో చెప్పబడినట్లు 'గురోరన్యం న భావయేత్' అంటే జగత్తులో



అంతటా వ్యాప్తమైయున్నది ఒక్క గురుపరమాత్మయే అనే భావనేకదా! అలాంటప్పడు నువ్వు ద్వేషించేది ఏమన్నా ఉందా? దీనినే అనేకత్వంలో ఏకత్వభావన అని చెప్పవచ్చుకదా? ఇది భావన కాకుండా అనుభవ పూర్వకంగా ఆచరించి తెలుసుకున్నవాడే 'అయమాత్మాబ్రహ్మ' అనే మహావాక్యాన్ని అనుభవించిన వాడవుతాడు. అది మాటలతో చెప్పకునేదికాదు.

అనుష్ఠానం చేసే మంత్రం అంతకన్నాకాదు. ఇక్కడ మీకొక వుదంతాన్ని చెబుతాను. నువ్వు మంచినీళ్ళు త్రాగుతున్నావనుకో అందులో ఒక చీమ ఉంది. ఆచీమని చంపకుండా నీటినుండి వేరుచేసి బయట వదిలిపెట్టి ఆ నీటిని తాగగలవా? లేక ఆచీమని చంపి అవతలపారవేస్తావా? పిపీలికాది బ్రహ్మపర్యంతం ఒకే భావన కలిగి వుండటమే అయమాత్మా బ్రహ్మఅన్నా లేక గురోరన్యంనభావయేత్ అని చెప్తుకున్నా" అన్నారు. శ్రీ బాబూజీ తిరిగి మాట్లాడుతూ అంతటా ఉన్నది గురుస్వరూపమే! అన్న భావనే 'గురోరన్యం న భావయేత్' అంటే, నువ్వుగుడికి వెడతావు, కష్టపడి క్యూలో నిలబడి భగవంతుని దర్శిస్తావు దానికోసం ఎంతో ధనాన్ని ఖర్చుపెడతావు. గుడిలో హుండీలో కూడా కొంతపైకాన్ని సమర్పిస్తావు. కాని గుడినుంచి బయటకురాగానే

అక్కడబయటకూర్చుని నిన్ను ధనసహాయం చేయమని అర్ధించే బిచ్చగాడిని చూసివాడికి సహాయం చేయకపోగా వాడిని దూషించకుండా ఉండగలవా? పోనీ అ బిచ్చగాడు ఏ అంధుడో, కుంటివాడో అయినా నీప్రవర్తనలో మార్పు ఉంటుందా? ఇదే విధంగా మీ ఇంటివెలుపల రాత్రి సమయంలో ఏదైనా ఒక కుక్క తలదాచుకుని నిదురిస్తే ఉదయం దానిని అక్కడనుంచి వెళ్ళగొట్టకుండా ఉండగలవా? మరి భగవద్గీతలో భక్తియోగంలో శ్రీ కృష్ణ పరమాత్ముడు బోధించిన 'సర్వభూతహితే రతాః' అన్న శ్లోకం అర్ధమేమిటి? సమస్త భూతములయందు దయకల్గి ఉండాలనే కదా. అటువంటి భక్తుడే నాకు ప్రియుడు అని స్పష్టంగా శ్రీ కృష్ణ పరమాత్ముడు తెలియజేయలేదా?" అన్నారు. ఇంకా మాట్లాడుతూ "సద్గురుమూర్తికి, పరమాత్మకీ భేదం లేదు. నా గురువే నాకు సర్వస్వము. ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి అనే భావన ఉన్నవాడికి ఎన్నటికీ లోటుండదు. గజేంద్రుడు అలాభావించినపుడే అతనికి రక్షణ జరిగింది. ద్రౌపదీ దేవి సర్వ సమర్పణ చేసుకుని శ్రీకృష్ణ పరమాత్ముని దైవంగా భావించినపుడే ఆమెకి రక్షణ చేకూరింది. సంపూర్ణ శరణాగతి పొందినభక్తుని యొక్క స్థితిని వైరాగ్యము అంటారు. పరిపూర్ణభక్తి అన్నా, వైరాగ్యమన్నా విడదీయడానికి లేదు. వైరాగ్యమంటే భగవద్గీత భక్తియోగంలో చెప్పబడినట్టు 'శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగ వివర్జితః' అన్నట్లుగా సుఖాన్నైనా, దుఃఖాన్నైనా శీతల ఉష్ణస్థితులనైనా, ఎంతో రుచికరమైన పాయసాన్నైనా, లేక వమనం చేసుకొనిన పాయసాన్నైనా సమదృష్టితో చూడగల్గాలి. అక్కడ ద్వైత భావన, పదార్థభావము లోపించి సమదృష్టి కలిగి ఉండటమే నిజమైన వైరాగ్యము. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. వీరబ్రహ్మంగారు తన శిష్యులలో నిజమైన భక్తిని నిరూపించడానికి ఒక పరీక్ష నిర్వహించారు.

ఒకనాడు శిష్యులందరిని పిలిచి దూరంగా ఒక చనిపోయిన కుక్కను చూపించి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, "మీలో ఎవరైనా మృతిచెందిన ఆ కుక్కని మహాప్రసాదంగా స్వీకరించండి. వారికి నా తపోశక్తినంతా ధారపోసి కాలజ్ఞానాన్ని వ్రాసే భాగ్యాన్ని ప్రసాదిస్తాను" అన్నారు. చనిపోయిన కుక్కచాలా జుగుప్సాకరంగా ఉంది. పురుగులతో

కులకులలాడుతూ, భరించరాని దుర్వాసన వస్తున్నది. శిష్యులు ఎవరూ గురువాజ్ఞాపాలన చేయడానికి ముందుకు రాలేదు. కానీ సిద్ధయ్యమాత్రం గురువాజ్ఞాపాలన చేయడానికి ముందుకు వచ్చాడు. చనిపోయిన కుక్కని తన హస్తములోనికి తీసుకున్నాడు. సద్గురుమూర్తిని ప్రార్థించాడు. దానిని గురు ప్రసాదంగా స్వీకరించడానికి సిద్ధపడ్డాడు. సిద్ధయ్య హస్తంలో ఉన్న మృతిచెందిన కుక్క పాయసంతో కూడుకున్న బంగారుపాత్రగా మారిపోయింది. కానీ సిద్ధయ్య దృష్టిలో మాత్రం పదార్థభావం లేదు. ఇది మృతి చెందిన కుక్క అని గానీ, లేక పాయసమనే దృష్టికానిలేదు. ఆయన మనస్సు గురువాజ్ఞాపాలన నిర్వహణలో లగ్నమైయున్నది. అదే నిజమైన భక్తిఅన్నా, వైరాగ్యమన్నా, దేనినీ ఏవగించుకోకూడదు. పదార్థభావన ఉండకూడదు. అన్నిటియందు నిరపేక్షభావన కలిగి ఉండాలి" అన్నారు.

## మానసిక భ్రమలు

"ప్రపంచంలో గుడ్డివాళ్లెక్కువా? కళ్లున్నవాళ్లెక్కువా? అన్న విషయం మీద ఒకసారి బీర్బల్‌కు, అక్బర్‌కూ వాదం జరిగింది. ఎవరెక్కువ అన్నది ప్రత్యక్షంగా చూపిస్తానన్నాడు బీర్బల్.

అతడు ఒక బట్టను తలకు చుట్టుకు వచ్చి, సభలో ఒకణ్ణి "నా నెత్తి మీద ఉన్నదేమిటి?" అని అడిగాడు. అతను అది "తలపాగ" అన్నాడు.

బీర్బల్ ఆ బట్టను విప్పి భుజాన వేసుకుని, మరొకణ్ణి పిలిచి, "ఇదేమిటి?" అని అడిగాడు. అతను "ఉత్తరీయం" అని చెప్పాడు.

మరికొంత సేపటికి అదే బట్టను కట్టుకుని బీర్బల్ సభకు వచ్చి మరొకడిని "ఇదేమిటి?" అని ప్రశ్నించాడు. అది "ధోవతి" అని అతడు సమాధానం చెప్పాడు.

"గుడ్డివాళ్లు! అంతా గుడ్డివాళ్లు!! ఇది బట్ట. దీన్ని ఒకడు తలపాగా అనీ, మరొకడు ఉత్తరీయం అనీ, వేరొకడు ధోవతీ అని భ్రమపడుతున్నారు" అన్నాడు బీర్బల్.

(గత సంచిక తరువాయి)

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## భజగోవిందమ్ మూఢమతే! -4

**'కామం, క్రోధమ్, లోభమ్, మోహమ్**
**త్యక్త్వాత్మానం, పశ్యతి సోఽ హమ్**
**ఆత్మజ్ఞాన విహీనా మూఢా**
**తే పత్యంతే నరక నిగూఢా'**



శ్రీ ఆదిగురువులు యింకా చెబుతున్నారు. కామ, క్రోధ, లోభ, మోహాదులను నీ హృదయం నుండి పారద్రోలు. అప్పుడు నిన్ను నువ్వు 'నేనెవరు?' అని ప్రశ్నించుకుని, దాన్ని గురించి ధ్యానిస్తే 'సోఽ హమ్' 'అది నేను' అని గుర్తించి అనుభవం తెచ్చుకుంటావు. ఏ మంగళకరమైన ఆత్మవస్తువు లేక చైతన్యమయితే నిన్ను , ఈ సమస్త సృష్టిని ప్రకాశింప జేస్తున్నదో అది నేను - నాలోనే వున్న అసలైన 'నేను' అని గుర్తిస్తావు. ఇటువంటి ఆత్మజ్ఞానాన్ని గుర్తించని మూఢులు, భయంకరమైన జనన మరణ విషయ వలయమనే నరకకూపంలో పడి ఘోరమైన యాతనల ననుభవిస్తారు. అని శ్రీ ఆదిశంకర భగవత్పా దాచార్యుల వారు బోధిస్తున్నారు.

ఈ అవిద్యారణ్యంలోని కామ, క్రోధ, మద, లోభ, మాత్సర్యయములనే క్రూర జంతువులని పారద్రోలాలంటే కేవలం ఒకే ఒక గొప్ప ఉపాయం వున్నది. అది 'ధ్యానమనే అగ్ని' రగుల్కొలపటం అని యింతకు ముందే చెప్పుకున్నాము.

సాలెపురుగు ఎలాగైతే తన నోటి నుండి వచ్చిన దారంతో అల్లుకున్న గూటిలోనే తాను బంధింపబడి, తన ప్రాణాలను కోల్పోతున్నదో అదే విధంగా మానవుడు కూడా 'దేహమే నేను' (దేహవాసన) అనే జైలులో తన నుండే వచ్చిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే గుణాలకి లోబడి, తన వినాశనాన్ని తానే తెచ్చుకుంటున్నాడు. ఇప్పుడు ఎవరు ఎవరిని బంధిస్తున్నారు? తన మనస్సే తనని బంధిస్తోంది. మనస్సు

నిరంతరం ప్రపంచ విషయాలలోనే సంచరిస్తూ వుంటుందని చెప్తూ ....
శ్రీగురుదేవులు "మానస సంచరరే .......... వంటింట్లో వంకాయకూరపైనో, పకోడీల మీద ......' అని ఛలోక్తిగా పాడుతూ వుండేవారు. నరదృష్టి ఎప్పుడూఅంతే - తిండి దృష్టి, వస్తువుల దృష్టి. కానీ శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు తమ మనస్సుని నిరంతరం బ్రహ్మము నందే చరించమని బ్రతిమిలాడుకున్నారు. 'మానస సంచరరే బ్రహ్మణి' అని, 'మదశిఖి పింఛ - అలంకృత చికురే। మహనీయ కపోల - విజిత ముకురే'

చక్కటి నెమలి పింఛమును, శిఖయందు ధరించి ముద్దులొలికే చెక్కిళ్ళతో అలరారే ఆ శ్యామసుందరుని యొక్క అందమును ధిక్కరించే దివ్యమంగళ విగ్రహమునందు నిలబడవే ఓ మనసా! అని వేడుకుంటున్నారు శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు.

'శ్రీరమణీకుచ దుర్గ విహారే
సేవక జన మందిర మందారే
పరమహంస ముఖ చంద్ర చకోరే
పరిపూరిత మురళీరవధారే
మానస సంచరరే బ్రహ్మణి - మానస సంచరరే॥

శ్రీ మహాలక్ష్మి యొక్క హృదయము నందు విహరించే వాడు, తననాశ్రయించిన సేవక జనుల పాలిట కల్పవృక్షము, పరమహంసలనే చకోర పక్షులు ఎల్లప్పుడూ గ్రోలే అమృతకిరణాలను ప్రసరించే చంద్రుడు, నిరంతరము తన వేణునాదంతో తీయని రాగాలు పలికిస్తూ సమస్త సృష్టినీ పరిపూర్ణంగా, ఆ మురళీరవంతో నింపినవాడు అయిన శ్రీకృష్ణ పరమాత్మ - ఆయనే బ్రహ్మణ్యో మధుసూదనోమ్ - ఆ పరబ్రహ్మమునందే నిరంతరం సంచరించవే ఓ మనసా! - అని శ్రీసదాశివ బ్రహ్మేంద్రుల వారు మనకి బోధ చేస్తున్నారు.

మన జీవితమే ఒక పూజా కుసుమంగా మారిపోవాలి. దీనికి ఒకే ఒక మార్గం. - "భజగోవిందమ్, భజ గోవిందమ్...."

-సశేషం

# పంచముడు

- ఉమాదేవి

కావేరీతీరంలో ఒక గ్రామంలో కాంచన శర్మ అనే ఒక నైష్ఠిక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన బహు ముక్కోపి. ఆ ఊళ్ళోనే కొండప్ప అనే పరమభక్తుడైన మాలదాసరి కూడా వుండేవాడు.

ఒక పర్వదినం నాడు కాంచనశర్మ తెల్లవారుజామునే కావేరిలో స్నానం చేయడానికి వచ్చాడు. కాంచనశర్మ స్నానం చేసి నదిలో నుండి ఒడ్డుకు వస్తుండగా, కొండప్ప కూడా అదే సమయంలో స్నానం చేసి, తల వంచుకుని నడుస్తూ ఆయన ప్రక్కగా వెళ్ళాడు. అప్పుడు కొండప్ప తడిబట్ట కాంచన శర్మకు తగిలింది.

కాంచన శర్మ రుద్రుడైపోయి, పళ్ళు పటపటా కొరుకుతూ కొండప్పను నానాతిట్లు తిట్టాడు. కొండప్ప మసక చీకటిలో తాను సరిగా చూడలేదనీ, తప్పు జరిగినదనీ క్షమించమని సాష్టాంగ నమస్కారం కూడా చేశాడు. అప్పటికీ కాంచనశర్మకు కోపం చల్లారలేదు. కొండప్ప శిరస్సును తన కాలితో నాలుగైదుసార్లు కోపంతో తన్ని, ఆ అస్పృశ్యుణ్ణి తాకినందుకు తాను మళ్ళీ నదిలో దిగి స్నానం చేశాడు.

ఆయన స్నానం చేసి వస్తూ, కొండప్ప కూడా మళ్ళీ స్నానం చేస్తుండటం గమనించి, "పంచముణ్ణి తాకినందుకు గాను నేను మైల పడ్డానని మళ్ళీ స్నానం చేశాను. కానీ మరి నీవు కూడా ఎందుకు మళ్ళీ స్నానం చేస్తున్నావు?" అని అడిగాడు.

దానికి కొండప్ప "కోపమనే పంచముడు మాలవాడికన్నా అధమాధముడు. వాడి స్పర్శ నాకు తగిలింది. కనుక పవిత్రుణ్ణి కావటానికి నేను మళ్ళీ స్నానం చేస్తున్నాను" అని సమాధానం చెప్పాడు.

# వైరాగ్యం

- పాలూరి కాళీప్రసాద్

మనకు సాధారణంగా ఇష్టమైన వాటిని చూస్తే రాగం, అలాగే ఇష్టం లేనివాటిపై ద్వేషం కలుగుతూ ఉంటుంది. అయితే ఏదైనా కష్టం కలిగినప్పుడో, చూసినప్పుడో, మంచిమాటలు విన్నప్పుడో క్షణికావేశంలో వైరాగ్యం కలుగుతూ ఉంటుంది. దీనినే మన పెద్దలు ప్రసూతివైరాగ్యం, శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యం అన్నారు. ఆయా సందర్భాలు దాటి పోగానే మళ్ళీ మన రాగద్వేషాలు మామూలే.

అయితే మనందరికీ సంతృప్తితో కూడిన వైరాగ్యం కలిగేది ఒక్క ఆహార విషయంలో మాత్రమే. మనిషికి ఇతర పదార్థాలు ఎన్ని ఇచ్చినా ఇంకా కావాలనే కోరుకుంటాడు. కానీ కడుపు నిండిన తరువాత ఆహారాన్ని ఇక కోరుకోడు. అది ఎంత ఇష్టమైన పదార్థమైనా సరే.

ఎందుకంటే ఇతర పదార్థాలు ఎన్ని పొందినా అవన్నీ మనకు భిన్నంగానే ఉంటున్నాయి. అదే ఆహారమైతే మనలో ప్రవేశించి మన స్వరూపాన్ని పొందుతోంది. అందుకే ఆ తృప్తి, ఆ వైరాగ్యం. తిన్న ఆహారం తన పని పూర్తి చేసుకుని మళ్ళీ మన నుంచి భిన్నత్వాన్ని పొందితే కానీ మనకు మళ్ళీ దాని మీద కోరిక కలుగదు.

అలాగే ఈ కనిపించే సృష్టి అంతా మన స్వరూపమే. మనకు భిన్నమైనది ఏదీ లేదు - 'నీవు చూచునదెల్ల నీవయే యనుచు తత్త్వమసి వాక్యం' - మనకు ఆరూఢ జ్ఞానమైనప్పుడు మనకు శాశ్వతమైన సంతృప్తి, అన్నిటిపట్ల వైరాగ్యం కలుగుతాయి. ఆ జ్ఞానాన్ని పొందేవరకు కనీసం మనకంటె భిన్నంగా ఏదీ లేదనే విషయాన్ని మాటిమాటికీ గుర్తు చేసుకుంటూ ఉంటే వైరాగ్యం పొందటం సులభమవుతుంది.

జై గురుదేవ్ !

# అంజలి

- కరుణ శ్రీ

2

సీ ॥ కూర్చుండ మా యింట కురిచీలు లేవు నా
ప్రణయాంకమే సిద్ధ పరచ నుంటి
పాద్యమ్మునిడ మాకు పన్నీరు లేదు నా
కన్నీళ్లతో కాళ్ళు కడుగ నుంటి

పూజింప మా వీట పుష్పాలు లేవు నా
ప్రేమాంజలుల సమర్పింప నుంటి

నైవేద్యమిడ మాకు నారికేళము లేదు
హృదయమే చేతి కందీయ నుంటి

తే.గీ॥ లోటు రానీయనున్నంతలోన నీకు
రమ్ము దయచేయుమాత్మ పీఠమ్ము పైకి
అమృత ఝరి చిందు నీ పదాబ్జముల యందు
కోటి స్వర్గాలు మొలిపించుకొనుచు తండ్రీ॥



# సమర్థ సద్గురు మాస పత్రిక
# జీవిత చందాదారుల (Life Members) కు
# చేయు సవినయ విన్నపము

ప్రియాత్మ బంధువులారా!

ది.02.04. 1981న శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి చేత ప్రారంభింపబడి, దినదినాభి వృద్ధి చెంది భక్తులను ఎంతగానో అలరిస్తున్న ఈ "సమర్థ సద్గురు" ఆధ్యాత్మిక మాస పత్రికకు మీరంతా జీవిత చందాదారులుగా చేరి చేయూతనిచ్చి ఈ మాస పత్రికను నిర్విఘ్నంగా, నిరంతరాయంగా నడిపిస్తున్నందుకు కృతజ్ఞులవం. అప్పటినుండి ఈ నాటి వరకు అంటే 36 సంవత్సరాలుగా 250 రూపాయిలు కట్టి మొదట చేరిన జీవిత చందాదారులకు ఇప్పటి వరకు ఈ పత్రికను పంపిస్తున్నాము.




ప్రింటింగ్ ఖర్చులు, పేపరు ఖర్చులు, తదితర ఖర్చులు విపరీతంగా పెరిగినవి. అయినా ఆధ్యాత్మిక ప్రచారమే లక్ష్యంగా చేసికొని సమర్థ సద్గురు యాజమాన్యం వారు చందా రుసుమును ఇంతవరకు పెంచలేదు. 2004లో ధనం లోటును పూడ్చే ప్రయత్నంగా మహారాజ పోషకులు చందా రూ.11116లు; రాజ పోషకులు రూ 5116లు; పోషకులు రూ 1116లు గా నిర్ణయించి ఈ పత్రికను నడుపుతూ వచ్చారు.

ఇటీవల భరించలేనంతగా ఖర్చులు పెరగడం వలన సమర్థ సద్గురు యాజమాన్యం వారు, 20 సంవత్సరాలు పూర్తి అయిన జీవిత చందాదారుల చేత రూ. 1116లు కట్టించ వలెనని, ఆ తదుపరి వారికి 20 సంవత్సరాలు ఆపకుండా "సమర్థ సద్గురు" పత్రికను పంపాలని నిర్ణయించినారు. 20 ఏళ్ళు పూర్తి అయిన చందాదారులను రూ.1116లు వెంటనే కట్టమని ప్రార్థిస్తున్నాము. కాబట్టి వెంటనే మీ జీవిత చందాను రెన్యూ చేసికొమ్మని మరీ మరీ ప్రార్థిస్తున్నాము. ఈ చందా రుసుము మేనేజర్, Y.S.C.K.P.M CHARITABLE TRUST, A/C SAMARDHA SADGURU, పేరున ఎమ్.ఓ, గాని బ్యాంక్ డ్రాఫ్ట్‌గాని పంపి సమర్థ సద్గురు యాజమాన్యానికి తోడ్పడండి.

రూ.11116లు కట్టి మహారాజ పోషకులుగా, రూ5116లు కట్టి రాజ పోషకులుగా చేరండి. శ్రీ బాబూజీ మహరాజ్ వారి అనుంగు భక్తులుగా మీకు తెలిసిన బంధు మిత్రులకు, తోటి సహాధ్యాయులకు ఈ పత్రిక అందేటట్లు చేయండి. ఇది చేయటానికి రెండు మార్గాలు ఉన్నాయి. 1. బంధు మిత్రులచేత చందా కట్టించటం; 2. మీరే వారి తరఫున చందా కట్టటం. వార్షిక చందాదారులు కూడా రు1116లు కట్టి జీవిత చందాదారులై ఈ మాసపత్రిక అభివృద్ధికి తోడ్పడండి. సమర్థ సద్గురు యాజమాన్యం వారికి చేయూతనిచ్చి ప్రస్తుత ఆర్థిక సంకటం నుండి దూరం చేయండి.

మీ సేవలో

సమర్థ సద్గురు యాజమాన్యం

- రమణ ప్రసాద్

# త్రిపురా రహస్యం

## జ్ఞాన ఖండం

కొన్ని నెలలు గడిచాయి. త్రిపురా దేవి అనుగ్రహం వలన హేమచూడుని మనస్సు విషయ విముఖమైంది. తత్త్వ విచారణ పైన శ్రద్ధ కలిగింది. ఒకనాడు హేమచూడుడు హేమలేఖ వద్దకు వచ్చాడు. ఆమె అతనిని తీసికొని వచ్చి ఆసనం పై కూర్చోబెట్టి, "ఇంత కాలం నాతో మాట్లాడకుండా, నన్ను చూడకుండా, ఎలా గడిపావు? అని అతనిని కౌగలించుకొని, దుఃఖించినట్లు కనిపించింది. ప్రియురాలి కౌగిలింతకు హేమచూడుడు ఏ మాత్రం వికారం పొందలేదు. అతడు హేమలేఖతో,



"ఈ విధంగా నన్ను మోహంలో పడవేయ వద్దు. నిన్ను నేను బాగా అర్థం చేసుకున్నాను. నువ్వు వివేకవంతురాలవు, ధీరవు. నువ్వు నాకు ఒక కథ చెప్పావు. దానిని స్పష్టంగా వివరించు. నీ తల్లి, నీ చెలికత్తె, ఆమె భర్త, ఆమె పుత్రులు ఎక్కడ ఉన్నారు?"

హేమలేఖ ముఖం ప్రసన్నమైంది. హేమచూడుని మనస్సు నిర్మలమైంది. అతనికి త్రిపురాదేవి అనుగ్రహం కలిగింది అని గ్రహించింది. ఇక అతనికి బోధ చేయటానికి సరి అయిన సమయం అనుకొని, అతనితో, "నాథా! ఈశ్వరునికి నీపై అనుగ్రహం కలిగింది. అందువలననే నీకు విషయముల పట్ల వైముఖ్యం కలిగింది. భోగములందు విముఖత, తత్త్వ విచారము పట్ల సుముఖత - ఈ రెండూ ఈశ్వరానుగ్రహాలే. నా వృత్తాంత రహస్యాన్ని చెబుతున్నాను. విను. - పరాచితియే(ప్రజ్ఞానమే, పర చేతనయే) నా తల్లి. నా సఖి అంటే నా బుద్ధి. అసతి అంటే అవిద్య. ఆ అవిద్యతో బుద్ధి స్నేహం చేసింది. ఆ అవిద్య యొక్క సామర్థ్యం లోకములో విదితమే. త్రాటిని సర్పంవలె

కనిపించేటట్లుగా చేస్తుంది.

మహామోహమే అవిద్య యొక్క కుమారుడు. అతని కుమారుడు మనస్సు. కల్పన మనస్సు యొక్క భార్య. ఐదు జ్ఞానేంద్రియాలు కల్పన యొక్క పుత్రులు. ఇంద్రియ గోళకాలే వారి భవనాలు. భోగ్య విషయాలను దొంగిలించటం అంటే, విషయానుభవం వలన కలిగిన సంస్కారాలను (వాసనలను) కూడబెట్టుకోవటమే. ఆ వాసనల అనుభవాలే స్వప్న భోగాలు.

"మహాశన" అనే పేరు కల కల్పన యొక్క సోదరియే ఆశ. కామ క్రోధములు ఆమె పుత్రులు.. నా పట్టణం అంటే నా శరీరం. నా మహామంత్రం అంటే "ఆత్మ స్వరూప స్ఫురణం".

మనస్సుకు ప్రియమిత్రుడు అంటే ప్రాణం. అడవులు అంటే నరకాలు. నేను బుద్ధితో కలియుట అనగా సమాధి. నా తల్లి వద్దకు వెళ్ళుట అనగా మోక్షము. ఇది నా వృత్తాంతము. దీనిని తర్కంతో బాగా తెలుసుకొని శ్రేయస్సును పొందు" అన్నది.

-సశేషం

ఇనుముకు, సూదంటురాయికి గల సంబంధమే నరునకు, నారాయణునకు మధ్యకూడా కలదు. అయితే నరుడు మరి నారాయణునిచే ఆకర్షింపబడటం లేదేమి?

బురదతో కూడివున్న ఇనుము, సూదంటురాయిచే ఆకర్షింప బడనట్లే, మాయలో మునిగి వున్న నరుడు, నారాయణునిచే ఆకర్షింప బడటం లేదు.

నీటితో కడిగి పరిశుభ్రం చేసిన ఇనుము ఏ ఆటంకం లేకుండా సూదంటురాయిచే ఆకర్షింపబడుతుంది.

అదే విధంగా నరుడు ఇహలోకంలో అంటిపట్టి ఉండే మాయా మలమును, సంతాప వేదనచే పొరలివచ్చు కన్నీటితో కడిగివేసినట్లయితే అతడు నారాయణునిచే ఆకర్షింప బడతాడు.

- శ్రీ రామకృష్ణ పరమహంస

# వెలుగు రవ్వలు

- పరాశర ప్రసాద్

శ్రీ ఆదిశంకరులు 'ప్రదక్షిణము' అనే పదానికి అర్థం చెబుతూ, **'పరిభ్రమతి బ్రహ్మాండ సహస్రాణి మహేశ్వరే! కూటస్థాఖిల రూపేస్మిన్ ఇతి ధ్యానం ప్రదక్షిణమ్'** అని వ్రాశారు.

అనగా 'ఓ ఈశ్వరా! నీకు ప్రదక్షిణ చేద్దామని బ్రహ్మాండ కోట్లు తిరిగాను. ఎక్కడా నీవే నిండియున్నావు. నిన్ను ఎట్లా చుట్టి వచ్చేది? కూటస్థాఖిల రూపుడవని ధ్యానిస్తాను. అదే నీకు ప్రదక్షిణం' అని భావం.

నమస్కారమంటేనూ అంతే. మనస్సు స్వస్థితి యందు అణిగి వుండటయే. అంతేకానీ నమస్కారమంటే లేస్తే ఒకసారి, కూర్చుంటే ఒకసారి, అటుపోతూ ఒకసారి, ఇటు పోతూ ఒకసారి మ్రొక్కటం కాదు.

అయితే పైన చెప్పిన ప్రదక్షిణ నమస్కారాదులు అతీత స్థితిగలవారికి గాని, సాధారణులకు కాదు. ముల్లోకములలో అద్వైతం చూపినా గురువుతో మాత్రం చూపరాదని శాస్త్రంలో వున్నది కదా - అని అనవచ్చు.

నిజమే. అద్వైతమంటే అసలు నమస్కారం చేయరాదని కాదు. అతికూడదు అన్నారు. భావమందు అద్వైతముండాలిగాని, బాహ్యమందు పనికి వస్తుందా?

అన్నిటిని సమదృష్టితో చూడమన్నారని, కుక్క తినే ఆహారం దానితో సమానంగా మనం తినగలమా? పిట్టకు పిట్టెడు ఆహారం సరిపోతుందని, అది మనకు సరిపోతుందా? మనం పట్టెడు అన్నం తిన్నామని ఏనుగుకు కూడా అంతే యిస్తే సరిపోతుందా? అందువల్ల భావములో అద్వైతముంచుకుని, బాహ్యానికి లోకాన్ని అనుసరించి సంచరించాలి.

జ్ఞానికి కష్టసుఖాలు ఏవీ సోకనప్పటికీ పరుల కోసం అన్ని కార్యాలు చేస్తాడు.

పూర్వం ఒక ఆచారం ఉండేది. ఇంట్లో ఒక వృద్ధుడు మరణిస్తే,

ఇంట్లో ఎవరికీ ఏడుపు రాదు. అయితేనేమి మరణించినందుకు ఇంట్లో ఎవరో ఒకరైనా ఏడ్చితీరాలి. అది ఆచారం. కూలికి డబ్బులు తీసుకుని ఏడ్వటమే వృత్తిగా కలవారు కొందరు ఉండేవారు. వాళ్ళని పిలిపిస్తే, భజన చేసినట్లు ఇది కూడా సాగించి, గుండెలు బాదుకుంటూ ఇంట్లో వారి కంటె కూడా ఎక్కువగా ఏడ్చేవారు.

అలాగే ఎదుటివారి చిత్తవృత్తికి తగినట్లు తాను కూడా క్రమం తప్పకుండా జ్ఞాని వర్తిస్తాడు. అన్నీ బాగా అభ్యాసం చేసి ఉండటం వలన ఏదీ వారికి కొత్త కాదు. ఎవరెలా పిలిస్తే అలా వెళ్తాడు. అన్నీ ఇతరుల కోసమే కానీ, వారి స్వంతానికి ఏదీ అక్కర్లేదు.

అడిగే వారి అర్హతలను బట్టి ఆచరణ జరుగుతుంది. మంచి చెడ్డలు ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యంగారు (రామాలయం అర్చకులు) 16-6-2017 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 68 సంవత్సరాలు.

శ్రీసద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# పరాభక్తి

- రమణ ప్రసాద్

పరాభక్తి అంటే ఎలాంటిది? ఇది అంతరంగంనుండి వెల్లి విరుస్తుంది. విషయానుభవాలకు కారణభూతమైన మనస్సు ఎప్పుడు నిర్విషయమవుతుందో , ఆలాంటి సమాధి స్థితిలో సాక్షాత్కరించే బ్రహ్మమే అని అనుభవపూర్వకంగా భక్తుడు తెలిసికుంటాడు. బ్రహ్మ సాక్షాత్కారం కానిదే "ప్రేమ" లభించదు. భగవంతునితో శాశ్వత సంబంధం కల్పించే దారమే ఈ "ప్రేమ". ఆ దారం పట్టు దారమై ఉండాలి. భగవానుని పాదాలు అతి సున్నితం కదా! అట్టి భక్తునికి భగవంతుడు అధీనంలో వుంటాడు.

భక్తి సగుణం. భక్తి పారవశ్యం నిర్గుణం. భక్తి భావం చెట్టును పట్టుకొన్న మామిడికాయ వంటిది. "ప్రేమ" మామిడిపండు వంటిది. "మామిడికాయ పచ్చిగా ఉన్నప్పుడు కోస్తే అది సొన కారుస్తూ ఏడుస్తుంది. దాని రుచో! పుల్లగా ఉంటుంది. మామిడికాయ పక్వస్థితికి వచ్చినప్పుడు దాని రంగు బంగారు వర్ణంగా మారుతుంది. దాని రుచి మధురంగా ఉంటుంది. అది దానంతటికదే చెట్టునుండి విడివడుతుంది. జ్ఞాని స్థితి అటువంటిది" అని శ్రీగురుదేవులు సెలవిచ్చి ఉన్నారు. శ్రీరామకృష్ణ పరమహంస " ప్రేమ" మామిడిపండు వంటిది అన్నారు.

" సా అస్మిన్ పరమ ప్రేమ రూపా" " అది భగవానుని యెడల పరమప్రేమ స్వరూపమగునది" - నారద భక్తి సూత్రములు (2) భగవంతుని పై గల అనన్య ప్రేమయే పరమ భక్తి. అట్టి భక్తి పొందాలంటే చిత్తవృత్తులను నిరోధించాలి. మనస్సు కామ రహితం కావాలి. అట్టి భక్తుడు పరలోకగతమైన భోగములను కోరడు. అంతే కాదు అతడు మోక్షమును కూడా కోరడు. ఆ స్థితియే అనన్య ప్రేమ. అదే అమృత స్వరూపం("అమృత స్వరూపా చ" నా. భ.సూ(3)) కూడా.

పరాభక్తి పొందిన భక్తుడు భగవంతుడిని తన అత్యంత ఆప్తుడుగా భావిస్తాడు. శ్రీకృష్ణుని పై కల గోపికల ప్రేమ అటువంటిది. అతడు జగద్గురువు, జగన్నాధుడు అయినా గోపికలు అతడిని గోపీనాధా! అని సంబోధించారు. "అలాంటి స్థితిలో భక్తుడు, "పరమేశ్వరా! నాకు ఐశ్వర్యం వద్దు. సౌఖ్యం వద్దు. మరేమీ వద్దు. నీ పాదారవిందములలో నాకు వినిర్మల భక్తిని ప్రసాదించు. అదే నాకు కావలసినది." అని కోరుకుంటాడు" అన్నారు శ్రీ రామకృష్ణ పరమ హంస.

శ్రీరామకృష్ణులవారు తాంత్రిక సాధనలను, వైష్ణవ సాధనలను

అభ్యసించాడు. 1864లో అద్వైత వేదాంతి, యతివరేణ్యుడు అయిన తోతాపురి ఆయనకు సన్యాస దీక్ష ఇచ్చాడు. “నేను కళ్ళు మూసికొన్నప్పుడు జగన్మాతయే దర్శనమిస్తోంది.” అని శ్రీ రామకృష్ణులవారు అంటారు తోతాపురితో. అప్పుడు ఆయన అక్కడ పడి ఉన్న గాజు పెంకును నుదుటి మీద గట్టిగా అదిమిపెట్టి, “ ఇక్కడ నీ మనస్సును ఏకాగ్రం చెయ్యి” అన్నారు. అంతే! మూడు రోజులు శ్రీ రామకృష్ణులు ధ్యానంలో ఉండి నిర్గుణ నిరాకార అఖండ బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు. ఎక్కడా మూడు రోజులకంటే ఎక్కువ నిలువని పరివ్రాజకోత్తముడు తోతాపురి శ్రీ రామకృష్ణుడి అఖండ ప్రతిభచే ఆకట్టుకోబడి దాదాపు ఒక ఏడాది అతనితో గడిపాడు. శ్రీ రామకృష్ణుడు చేస్తున్న సగుణారాధనను గర్హించేవాడు. శ్రీ రామకృష్ణులు చిరునవ్వే సమాధానంగా ఇచ్చేవారు.

ఒకనాడు తోతాపురి వారు భరించలేని కడుపునెప్పితో మెలికలు తిరిగిపోతూ, తన మనస్సును బ్రహ్మ వస్తువుపై ఉంచలేకపోయాడు. “ఇక నా జన్మ నిరర్థకం” అని గంగానదిలో ఆత్మహత్య చేసుకోబోయాడు. ఆశ్చర్యం ! నదిలో ఎంత నడిచినా మోకాలు లోతు నీరే ఉండటంతో తన సంకల్పాన్ని విరమించుకున్నాడు. అప్పుడే ఆయనకు దేదీప్యమానమైన జగన్మాత దర్శనం అయింది. “అఖండవ్యాప్తమై ఉన్న జగన్మాతయే తనలో విరాజమానమై ఉన్నద”న్న సత్యాన్ని గ్రహించారు తోతాపురి. ఇదంతా చూసి శ్రీ రామకృష్ణులవారు లోలోపల నవ్వుకున్నారు.

అట్టి పరాభక్తి ఏ కొద్దిమందికో లభిస్తుంది. శ్రీ చైతన్య మహాప్రభు, శ్రీ రామకృష్ణ పరమ హంస, శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ ప్రసాదబాబూజీ మహరాజ్ వంటి వారు ఈశ్వర సంపదకు వారసులైన భగవదంశ సంభూతులు.

భక్తి, జ్ఞానం - ఈ రెంటినీ వేరు పరచలేము. నీరు ఘనీభవించి ఐసుగా, మారుతుంది. ఆ నీటిని మరిగిస్తే ఆవిరిగా మారి అరూపమవుతుంది. ఉష్ణోగ్రత తగ్గితే ఆవిరి తిరిగి నీరుగా, ఐసుగా మారుతుంది.

“భగవంతుని ఎడల ప్రగాఢమైన భక్తి జ్ఞానం; జ్ఞాన పరాకాష్ఠ ముముక్షుత్వం” అని ప్రబోధించారు శ్రీ గురు మహరాజ్ వారు. మోక్షగామి ముందుగా సగుణోపాసన చేయాలి. అలా చేస్తూ నిర్గుణోపాసనకు ఎగ బ్రాకాలి. భగవంతుడు తనలోను, బయటా వ్యాప్తుడై ఉన్నాడు అనే విషయం అనుభవానికి వస్తుంది.

# శరణాగత భక్తుడు

- గాలి జగదీశ్

ఒకనాడు శ్రీకృష్ణార్జునులిద్దరూ షికారుకు బయలుదేరారు. దారిలో కృష్ణుడు "అర్జునా! ఆ కొంగలు చూడు ఎంత బాగున్నాయో! ఎంత చక్కగా బారులు తీర్చి కూర్చున్నాయో!" అన్నాడు.

"అవును. చాలా బాగున్నాయి బావా! బారులు తీరిమరీ బాగున్నాయి ఆ కొంగలు" అన్నాడు అర్జునుడు.



మరి కొంతసేపటికి కృష్ణుడు "అర్జునా! ఆ కాకులను చూశావా! ఎంత చక్కగా కూర్చుని ఉన్నాయో!" అంటూ ఇంతకు పూర్వం చూపించిన పక్షులనే మరల చూపిస్తూ అన్నాడు.

"అవును కృష్ణా! ఆ కాకులు చక్కగా ఆకులు పరచినట్లు వున్నాయి" అని ప్రతివచనం పలికాడు అర్జునుడు.

"అర్జునా! ఏమిటి నీ మనోస్థితి? నేను కొంగంటే కొంగంటావు, నేను కాకంటే కాకంటావు. నీ విచక్షణ ఏమైంది? నీ మనస్సు ఎక్కడకి వెళ్ళింది?" అన్నాడు అచ్యుతుడు.

"కృష్ణా! నా మనస్సు ఎక్కడకీ పోలేదు. నీ దగ్గరే ఉంది. కాకి అయితే నాకెందుకు? కొంగైతే నాకెందుకు? అయినా అన్నది చూపించగల సమర్థుడవు నీవు. అందుకే నీ రాగంలో శ్రుతి కలపడమే నా యోగం. నీవు కొంగ అంటే అది కొంగే! నీవు కాకి అంటే అది కాకే!" అన్నాడు భక్తిగా అర్జునుడు.

ఇదియే శరణాగతుని యొక్క లక్షణము

# ఫకీరు ఆస్తిక్య బుద్ధి

సేకరణ - మురళి

(వార్తాలాపము నుండి)

తపశ్శాలియగు శాహసుజాకు పరమధార్మికురాలు, యౌవనవతియగు ఒక కుమార్తె ఉంది. కేర్మాను దేశపు చక్రవర్తి ఆ కన్యను తనకు యిచ్చి వివాహం చేయమని శాహసుజాకు వర్తమానం పంపించాడు. శాహసుజా సమాధానం చెప్పటానికి మూడురోజులు గడువు కోరాడు. శాహసుజా ఎన్నో మసీదులు గాలించగా, మూడవరోజు ఒక మసీదులో ఎంతో భావయుక్తంగా నమాజు చదువుతున్న యువకుడు కనిపించాడు. అతని నమాజు పూర్తి అయ్యేవరకు వేచి యుండి, అతనిని 'నీకు పెళ్ళి చేసుకోవాలనే కోరిక వున్నదా?' అని ప్రశ్నించాడు. వెంటనే అతను 'నా దగ్గర మూడు డబ్బులు కంటె ఎక్కువ లేవు. నావంటి దరిద్రునకు ఎవరైనా తన కుమార్తెను ఇస్తారా?' అని తిరిగి ప్రశ్నించాడు.



శాహసుజా 'నా కుమార్తెను నీకిచ్చి పెళ్ళి చేస్తాను. నీ దగ్గర వున్న మూడు డబ్బులలో ఒక డబ్బుతో సాంబ్రాణి, ఒక డబ్బుతో రొట్టె, మరొక డబ్బుతో పటిక బెల్లము కొనుక్కుని రా' అన్నాడు. ఈ విధంగా శాహసుజా తన కుమార్తె వివాహం ఆ బీద ఫకీరుకిచ్చి జరిపించాడు. ఎంత ఆశ్చర్యం! అపార ధనవంతుడగు కేర్మాను చక్రవర్తికి యిచ్చి పెళ్ళి చేయకుండా, దైవ భక్తుడు, ధ్యాన పరాయణుడగు ఒక బీద ఫకీరుకిచ్చి చేశాడు!

వివాహం అయిన నాటి రాత్రి ఆ కన్య తన భర్త కుటీరంలో ప్రవేశించి, నాలుగు ప్రక్కల పరికించి చూసింది. ఒక మూల జలపాత్ర, ఎండిన రొట్టెముక్క కనిపించాయి. 'ఈ రొట్టెముక్కను ఇక్కడ ఎందుకు ఉంచావు?' అని భర్తను ప్రశ్నించింది. భర్త సమాధానం చెబుతూ 'రేపటి ఆహారంగా పనికివస్తుందని నిన్ననే దాచి ఉంచాను' అని సమాధానం చెప్పాడు. ఈ మాట వినగానే ఆమె నిస్పృహతో తన పుట్టింటికి పోవటానికి సిద్ధపడింది. 'శాహసుజా వంటి ధనికుని కుమార్తె, నా వంటి బీద ఫకీరుకు సహధర్మచారిణి కాదగదు అని నేను ముందుగానే ఎరుగుదును' అన్నాడు భర్త.

దానికి ఆమె ఇలా బదులు పలికింది 'ప్రియతమా! నీ బీదరికం చూసి నేను పుట్టింటికి వెడుతున్నానని నీవు అనుకోవద్దు. నీ ప్రభు పరాయణత్వము నందలి లోపమునకు నేను బాధపడుతున్నాను. 'రేపు ఏమితినాలి?' అనే ఆలోచనతో నీవు ఈ రొట్టె ముక్కను నిన్ననే నిలువ జేసి పెట్టావు. నీకు అల్లా యందు నమ్మకము లేదు. మా తండ్రిగారు నీ పైపై ఆడంబరాలు చూసి నిన్ను ఎంచారనిపిస్తోంది నాకు. ఇరువది సంవత్సరాలు నన్ను పెంచి పెద్దచేసి, దేవునిపై పూర్తి ఆస్థిక్యబుద్ధి కలవానికే నిన్ను యిచ్చి పెళ్ళి చేస్తానని మాట ఇచ్చారు నాకు. కానీ, నీకు రొట్టె ముక్క తెచ్చియిస్తాడన్న నమ్మకం కూడా లేదు" అన్నది బాధతో.

అది విని ఫకీరు స్తబ్ధుడయి, ఎంతో సిగ్గుపడి, ఆ రొట్టెముక్కను దూరంగా విసిరివేశాడు. ప్రభుపరాయణుడయిన వానికి 'రేపు ఏమి జరుగుతుంది?' అనే చింత ఉండదు.

# ముండకోపనిషత్తు

- రమణ ప్రసాద్

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ**

**యథా పృథివ్యామ్ ఓషధయః సంభవంతి ।**

**యథా సతః పురుషాత్ కేశలోమాని**

**తథా క్షరాత్‌సంభవతీహ విశ్వమ్ ॥**

సాలెపురుగు ఎలా తన గూడును నోటినుండి వెలికి తీసితన లోకే తీసుకుంటుందో, భూమినుండి మూలికలు ఎలా ఉద్భవిస్తాయో, మానవుని తల పైన వెంట్రుకలు ఏప్రమేయం లేక ఎలా పెరుగుతాయో, అలాగే అక్షరత్త్వం నుండి ఈ విశ్వం ఉత్పన్నమవుతోంది.

తపస్సు వల్ల బ్రహ్మం, బ్రహ్మం నుండిఅన్నం, అన్నంనుండి ప్రాణశక్తి, మనస్సు, పంచభూతాలు, లోకాలు, కర్మలు అన్నీ ఉద్భవించాయి. బ్రహ్మ సర్వవిదుడు. ఆయననుండి ప్రాణులు, ఆహారం ఉద్భవించాయి.

ద్వితీయఖండం

ఋషులు  వేద మంత్రాలలో ఏయే యజ్ఞ కర్మలను దర్శించారో అవి కూడా సత్యమే. సత్యప్రియులారా! మీరు వాటిని విధిగా ఆచరించండి. ప్రశస్త జీవనానికి మార్గం ఇదే.

హెూమాగ్ని చక్కగా మండుతూ జ్వాలలు లేస్తూ ఉన్నప్పుడు అగ్నికి రెండు భాగాల మధ్య ఆహుతులు అర్పించాలి. కాళి, కరాళి, మనోజవా, సులోహితా,సుధామ్రవర్ణా, స్ఫులింగినీ, విశ్వరుచీ - ఈ ఏడు అగ్నికి నాలుకలు. ఈ జ్వాలలో ఎవడు ఆహుతులు అర్పిస్తాడో, అతడిని, ఆ ఆహుతులు సూర్య కిరణాలై ఇంద్రుని  వద్దకు తీసుకువెళ్తాయి.

పద్ధెనిమిది  అంగాలతో కూడిన యజ్ఞ కర్మలు దుర్బలమైన తెప్ప వంటివి. కనుక ఇదే పరమార్థమని భావించేవారు  జరా మృత్యు చక్రంలో పడిపోతారు. అజ్ఞానంతో ఈ మూఢులు తామే కృతకృత్యులమని భావిస్తారు. ఎందువలన అంటే కర్మ ఫలాల పట్ల ఆసక్తి ఉన్నంత వరకు జ్ఞానోదయం కాదు. పుణ్య కర్మల వల్ల స్వర్గ లోకాలు అనుభవించి, తిరిగి అధోగతి పాలౌతారు.

శాంత చిత్తులు, విద్వాంసులు, భిక్షాటన చేస్తూ, తపోనిష్ఠతో జీవితాన్ని గడిపి పాపాలను హరింపచేసుకుని, సూర్య మార్గం ద్వారా మరణ రహితమైన తత్త్వాన్ని పొందుతారు.

ముముక్షువు వివిధ కర్మల ద్వారా ప్రాప్తించే లోకాల పట్ల వైరాగ్యాన్ని, ఔదాసీన్యాన్ని వహించాలి. ఆతత్త్వాన్ని తెలుసుకోవటానికిఅతడు వేద విదుడు, బ్రహ్మ నిష్ఠుడు అయిన గురువును ఆశ్రయించాలి.

తస్మై స విద్వానుపసన్నాయ సమ్యక్
ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ
యేనాక్షరం పురుషం వేద సత్యం
ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మ విద్యామ్ ॥

సాధన సంపత్తి కలిగి, నిశ్చలమైన మనస్సుతో సమీపించిన ఆ ముముక్షువుకు ప్రాజ్ఞుడైన గురువు అతడు అవగాహన చేసికొనే రీతిలో ఉపదేశించాలి.

- సశేషం

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జులై 2017, ఆగస్ట్ 2017, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

జులై 2017: AS 3728, 5916, 5916, 6405, 6554, 6852, 6881, 6882, 6883, AS 6884, 7134, 7285 నుండి 7297 వరకు, 7299 నుండి 7327 వరకు.

ఆగస్ట్ 2017: AS 5457, 7139, 7142, 7146, 7332 నుండి 7337 వరకు, AS 7339 నుండి 7343 వరకు, 7348, 7349, 7354, 7355

– మేనేజర్

# ఎవరు అధికులు?

- పరాశర ప్రసాద్

శ్రీరామచంద్రుని శిష్యుడు హనుమ. శ్రీకృష్ణ భగవానుని శిష్యుడు అర్జునుడు. వీరిరువురి శిష్యులలో ఎవరు అధికులు? వారిరువురి మధ్య ఆ సమస్యే తలెత్తింది. దానిని తీర్చగల సమర్థత ఎవరికుంటుంది? కేవలం సద్గురుమూర్తికి మాత్రమే సాధ్యం.

అర్జునుడు పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ రామేశ్వరం చేరుకున్నాడు. రామసేతువును గురించి వినివున్నాడేమో, దానిని దర్శించి, వ్యాఖ్యానిస్తూ ఈ సేతువును నిర్మించడానికి రామునికి వానరసేన సహాయం కావలసి వచ్చిందా? శ్రీరామచంద్రుడు ధనుర్విద్యా పారంగతుడే! తన ధనుర్బాణాల తోనే ఈ సేతువును నిర్మించలేకపోయాడా?అదే నేనయితే నా ధనుర్బాణాలతో సేతువుని నిర్మించేవాడిని. ఎవరి సహాయాన్ని కోరేవాడిని కాదు. ఆయనకి సహాయపడింది వానరులా? అని వ్యాఖ్యానం చేసిన మరుక్షణం అర్జునునికి ఎదురుగా ఒక వానరుడు నిల్చుని మాట్లాడుతూ

"ఏమిటయ్యా అంటున్నావు? శ్రీరామచంద్రుడంటే ఎవరో తెలుసా? ఆయన ధనుర్విద్యనే అవమానిస్తావా? నువ్వు ధనుర్విద్యలో ఆయనకన్నా గొప్పవాడివా? ఏదీ! నీ ధనుర్బాణాలతో సేతువు నిర్మించు, చూస్తాను. దాని మీద నేను కుప్పిగంతులు వేస్తే అది కూలిపోతుంది. అలా కూలని పక్షంలో నేను ఆత్మహత్య చేసుకుంటాను" అన్నాడు.

వెంటనే అర్జునుడు కలుగజేసుకుని మాట్లాడుతూ "అయితే విను, నేను నా ధనుర్బాణాలతో సేతువు నిర్మిస్తాను. అది కనుక నీవు కూలగొడితే నేను ఆత్మహత్యచేసుకుంటాను" అన్నాడు. వెంటనే అర్జునుడు తన ధనుర్బాణాలతో సేతువును నిర్మించాడు. వానరుడు దాని మీద నిలబడి కుప్పిగంతులు వేసేసరికి అది కూలిపోయింది. వారిద్దరి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం అర్జునుడు చితిపేర్చి ఆత్మహత్యకు సిద్ధపడిన మరుక్షణం అక్కడికి ఒక బాలుడు వచ్చాడు. వచ్చినవెంటనే ఆ బాలుడు అర్జునుడిని ఆత్మహత్యచేసుకోవద్దని, ఇదే పందెం రెండోసారి వేసుకుని, అప్పుడు ఎవరు గెలిస్తే వారు నెగ్గినట్లుగా భావించండని ఒప్పించాడు. సరే అని ఆ బాలుడు చెప్పినట్లు చేశారు.

ఈసారి వానరుడు ఎన్ని గంతులు వేసినా ఆ వారధి కూలలేదు. వానరుడు ఒప్పందం ప్రకారం ఆత్మహత్యకు సిద్ధపడిన క్షణంలో ఆ బాలుడు

అర్జునునికి కృష్ణునిగా, వానరునికి శ్రీరామునిగా దర్శనమిచ్చాడు. ఇరువురిని ఉద్దేశించి మాట్లాడుతూ "హనుమా! నువ్వు శ్రీరామునిగా, అర్జునుడు శ్రీకృష్ణునిగా భావనచేసేది నేనే సుమా! మీరివురు గురుసోదరులు. మీ మధ్య తలెత్తిన విభేదాన్ని మరచి కలిసిమెలసి వుండండి" అని హెచ్చరించాడు.

అందువలననే అర్జునుని రథంపై ఎగిరే జండాపై కపిరాజు వుండటానికి కారణం ఇదేనేమో!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జూలై 2017

04 మంగళ - తొలి ఏకాదశి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

09 ఆది - ఆషాఢ (గురు) పౌర్ణమి, ఉదయం 11గం॥లకు, శ్రీ సద్గురుపాద పూజ, సత్సంగం, భక్త సమారాధన-చాతుర్మాస దీక్షా ప్రారంభం

18 మంగళ - శ్రీగురుదశమి, సాయంత్రం 5గం॥30నిలకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

ఆగస్ట్ 2017

04 శుక్ర - వరలక్ష్మీ వ్రతం.

07 సోమ- రాఖీ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

15 మంగళ - శ్రీ కృష్ణ జన్మాష్టమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

17 గురు - శ్రీ గురు దశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

25 శుక్ర - వినాయక చవితి - ఉదయం 11గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

నీకు నిజమైన పరిత్యాగమంటే యేమిటో తెలియదు అహంకారము, కోరికలను విధ్వంసము చేసినప్పడే యెవరికైనా పరిపూర్ణ శాంతి లభిస్తుందని తెలుసుకో, కోరికలను అహంకారమును సంహరించటము వలన మాత్రమే శాశ్వతము, అవినాశమైన శాంతి, ఆనందము లభిస్తాయి. అంతేకాని ప్రపంచాన్ని వదలివేయటం వలన, శాంతి లభించదు, నీవు నిజమైన పరిత్యాగమనే రత్నమును పోగొట్టుకొన్నావు, నీవు నకిలీదైన పగిలిపోయిన గాజుముక్క కోసం యెన్నో బాధాకరమైన నియమనిష్ఠలు చేశావు. ఇదంతా నీ తప్పడు దృక్పథము యొక్క ఫలితము, అందువలనే నీకు మనశ్శాంతి లేదు, అమూల్యమైన చింతామణి నీ ముందున్నా నీవు తపస్సు వలన శాంతిని పొందవచ్చని, తప్పగా వూహించావు. నీవు చింతామణిని పొందాననే భ్రాంతిలో వున్నావు, చివరకు నీవు పొందిన లాభం పగిలిపోయిన గాజుముక్కంత విలువ కూడ లేదని తెలుసుకొంటావు.



కుంభముని తన సంభాషణనింకా కొనసాగించాడు. 'ఓ మహారాజా! శ్రద్ధగా విను నేనిప్పడు వింధ్య పర్వత శ్రేణిలో వున్న యేనుగు కథ అర్థమును, చక్కగా వివరిస్తాను, ఆ అరణ్యములోని ఏనుగు యెవరో కాదు, నీవే, ఆ ఏనుగుకున్న రెండు దంతాలు వైరాగ్యము, వివేకము, వేటగాడు అజ్ఞానమునకు చిహ్నము. ఏనుగును వెంటాడిన వేటగాడు అజ్ఞానమునకు ప్రతీక ఏనుగు వేటగాని చేత బంధింపబడ్డప్పడు వేదనకు గురియైనట్లు, నీవు అజ్ఞానముచేత, అనేక బాధలకు లోనవుతున్నావు. ఎలాగైతే, ఆ బలీయమైన యేనుగు వుక్కు సంకెళ్ళతో బంధింపబడ్డదో, అలాగే కోరికలనే యినప సంకెళ్ళు నిన్ను బంధితుణ్ణి చేస్తున్నాయి. వాస్తవంగా కోరికలు, యినప సంకెళ్లకన్నా దృఢమైనవి, ఇనుము

తుప్పపట్టి, క్రమేపి వృధా అవుతుంది, కాని కోరికలు రోజు రోజుకు రెట్టింపయి, నిన్ను త్వరితంగా బంధిస్తాయి.

"ఏనుగెలాగైతే తన యినప సంకెళ్లను ఛేదించుకొన్నదో, అలాగే నీవు రాజ్యము, విషయ భోగాలు, భార్య, బంధువులు, స్నేహితులు మున్నగు బంధములన్నిటిని ఛేదించుకొన్నావు. ఓ రాజా! వుక్కు సంకెళ్లను ఛేదించుకొనటం సులభమే కాని కోరికలు, ఆశలు, ఆశయాలనే బంధాలను ఛేదించటము చాలా కష్టము, ఏనుగు వేటగాడు నేల మీదపడ్డాడు, అజ్ఞానమును విషయ భోగముల పట్ల విముఖత వైరాగ్యము వల్ల నిర్మూలం చేయాలని సంకేతము నీకు అసలైన పరిత్యాగమేమిటో అవగాహనలేదు నీవిప్పటికీ, అన్నిటిని వదలివేయలేదు.

శిఖిధ్వజుడిలా ప్రశ్నించాడు "నేను నా సామ్రాజ్యము, రాజ భవనమును, నా సకల సంపదను అన్నిటికంటే నాకత్యంత ప్రియమైన భార్యను కూడ త్యజిస్తే, మీరు నాకున్నదంతా వదులుకోలేదని యెలా చెప్తున్నారు? నేను సర్వస్వాన్నీ వదులుకోలేదా? ఈ పనులన్నీ లోపరహితమైన, నిజమైన త్యాగానికి, వైరాగ్యమునకు ప్రతీకలు కావా?"

కుంభముని సమాధానము చెప్పాడు "నీవు నీ రాజ్యాన్ని, రాజభవనమును, మిత్రులను బంధువులను అంతకంటే ప్రియమైన నీ భార్యను త్యజించినా, అది నిజమైన పరిత్యాగము కాదు, ఇందులో యేవి నీకు చెందినవికావు, అవి వాటంతట అవే వచ్చి, మరల వదలిపోయాయి. కాని నీవు నీ అహంకారాన్ని, కోరికలను త్యజించలేదు, నీవు నీ అహంకారాన్ని, కోరికలను సంపూర్తిగా నిర్మూలం చేసుకొన్నప్పుడే, నీ దుఃఖాల నుండి విముక్తడవయి, నిత్యానంద సుధను, శాశ్వతమైన శాంతిని పొందగలవు.

అప్పుడు శిఖధ్వజుడిలా అన్నాడు "ఇప్పుడీ అరణ్యమే, నా సర్వస్వము, ఆ రాళ్లు, వృక్షాలు, చెట్ల గుబుర్లే యిప్పటి నా సంపద, ఇదే నిజమైన త్యాగమైతే నేను వీటిని కూడ వదులుకోటానికి సంసిద్ధుడునై వున్నాను. కుంభముని యిలా సమాధానము చెప్పాడు, నీకింకా కోరికలు అహంకారము వున్నప్పుడు, నీవరణ్యాన్ని విసర్జించినా, అది నిజమైన త్యాగమనిపించుకోదు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జూలై 2017

04 మంగ - తొలి ఏకాదశి - శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

09 ఆది - ఆషాఢ (గురు) పౌర్ణమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన,చాతుర్మాస్య దీక్షా ప్రారంభం.

16 ఆది - దక్షిణాయన ప్రారంభం.

18 మంగ - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

22 శని - మాస శివరాత్రి , పావులూరు శాఖలో ఏకాహం.

23 ఆది - అమావాస్య.

26 బుధ - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

ఆగస్ట్ 2017

04 శుక్ర - వరలక్ష్మీ వ్రతము.

05 శని - శని త్రయోదశి.

07 సోమ - రాఖీ పౌర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.(రాత్రి పాక్షిక చంద్ర గ్రహణం)

14సోమ - శ్రీ కృష్ణ జన్మాష్టమి - ఉదయం కలశ స్థాపన; శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన; భక్త సమారాధన; రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ.

15 మంగ - స్వాతంత్ర దినోత్సవం. ఉదయం 11గం।లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

16 బుధ - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 7 గం॥లకు ఉట్టి కొట్టుట

17 గురు - శ్రీ గురు దశమి- సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

18 నుండి 24 వరకు మౌన ధ్యాన సప్తాహములు

19 శని - శని త్రయోదశి

20 ఆది - మాస శివరాత్రి. , పావులూరు శాఖలో ఏకాహం.

21 సోమ - అమావాస్య.

25 శుక్ర - వినాయక చవితి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, 11గం.లకు సామూహిక వినాయక పూజలు, భక్తసమారాధన.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

సద్గురుదేవులు ప్రశ్నిస్తూ కాలజ్ఞానం ఎవరికి ఉంటుంది? కాలం లో వున్నవాడికి ఉత్తరాయణం, దక్షిణాయనం అనేవి వుంటాయి. ఆయనాలు మారినట్లు ఎవరైనా గుర్తించగలవారున్నారా? పోనీ ఆ తేడాని అనుభవించినవారున్నారా? ఆయనాలు మారినా మానవుల ప్రవర్తనలో గాని, భావనలోగాని, క్రియలోగాని, ఏమన్నా తేడా వుందా! పోనీ మన దేహంగాని, ఇంద్రియాలుగాని, మనస్సుగాని ఆ తేడా చూపిస్తున్నాయా? కాలదృష్టిలేని జ్ఞానికి అసలు కాలంతో పని ఏముంది? ఆయనాలు మారినా ఋతువులు మారినా మానవుని దినచర్యలో మార్పు వుంటుందా? ధనంకోసం, పదవులకోసం, కీర్తి ప్రతిష్ఠలకోసం ప్రాకులాడేవారి భావనలో ఏమన్నా మార్పు ఉంటోందా? పోనీ గాఢ నిదురలో ఉన్నవాడికి కాలదృష్టి ఉండదుకదా! అది అందరికి తెలిసిన విషయమే.



ప్రాపంచిక వ్యవహారాలలో సంచరించే మానవుడు దేశాన్ని, కాలాన్ని మరువగలిగినప్పుడు జాగ్రదావస్థలో ఏక్రియలో ఉన్నా దేశాన్ని కాలాన్ని మరచి తన యదార్థ స్థితి ఎరుక కల్గిన జ్ఞాని స్థితిని ఎవరైనా ఊహించ గల్గుతారా? అసంభవము.

జ్ఞానం పొందేదికాదు. అది సిద్ధింపజేసుకునేది. అది నీలోనే అంతర్గతంగా ఉంది. జ్ఞానం ఘనీభవించి, జ్ఞానస్వరూపులై అవతరించి వచ్చినవారే సద్గురుమూర్తి. అన్నమాచార్యులు వంటి భక్తులు భగవంతుని కోసం క్షేత్రాలు దేవాలయాలు వెతికి వెతికి అలసిపోయారు. అంతర్యామిగా ఉన్న జ్ఞానమూర్తి అయిన భగవానుని కోసం నీకు

భిన్నంగా ఎంత వెతికినా గోచరిస్తాడా? బహిర్ముఖమైన మనస్సుని అంతర్ముఖం చేస్తే ఆయన గోచరిస్తాడు. బహిర్ముఖమైన మనస్సు కానివి పోనివి కర్మములు చేసి, కాలంలోపడి కాలుని బారిన పడక తప్పదు కదా! అని గురుదేవులు హెచ్చరిస్తున్నారు. గాఢ నిదురలో వున్న వానికి కాలం తెలియదు కదా! కాలుని బారిన పడతామనే భయం లేదు. అది గాఢ సుషుప్తి. అయితే ఆ స్థితిని జాగ్రదావస్థలో అంటే మెలకువలో కాలుని బారిన పడతామనే భయం లేకుండా జీవించగల సాధకుడు ధన్యుడు. నిర్భయుడు. ధీరుడు. అట్టి ధీరుడు గురువే సాక్షాత్ పరబ్రహ్మగా గుర్తించ గలుగుతాడు.

## పెదనింత్రకాలను శాఖలో కార్యక్రమాలు

జూలై 2017

04 మంగళ- తొలి ఏకాదశి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ

09 ఆదివారం- ఆషాఢ (గురు) పౌర్ణమి, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.(చాతుర్మాస్య దీక్షా ప్రారంభం)

18 మంగళవారం - శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ..

ఆగస్ట్ 2017

07 సోమ - రాఖీ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

15 మంగళవారం - శ్రీ కృష్ణ జన్మాష్టమి - రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ; ఉట్టి కొట్టుట.

17 గురు - శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాదపూజ

25 శుక్ర - వినాయక చవితి - ఉదయం 11గం.లకు వినాయక పూజ; శ్రీసద్గురుపాదపూజ.

# కుమారస్వామిని నాగ దేవతగా ఎందుకు పూజిస్తారు?

- రమణ ప్రసాద్

స్కందుడిగా, సుబ్రహ్మణ్యస్వామిగా కొలువబడే కుమారస్వామి శివ పార్వతుల కుమారుడు. శివుడి సేనకు అధిపతి, దృఢకాయుడు, జ్ఞాని. నెమలి అతడి వాహనము. తారాకాసుర సంహారము కొరకై పుట్టిన కారణ జన్ముడు. శివుడు అతడిని సేనానాయకునిగా నియమించి తారాకాసురుడిపైకి యుద్ధానికి పంపుతాడు. బాలుడైనా ఎంతో ధైర్యంగా పోరాడి అతడిని సంహరిస్తాడు. అందుచేత అతడు 'తారాకాసుర హారకుడు' అనే నామంతో ప్రసిద్ధి పొందాడు. కృత్తిక దేవతలచే పెంచబడి కార్తికేయుడిగా పేరు గాంచాడు.



శత్రువులకు అరి భీకరుడు కనుక 'స్కందుడై'నాడు. క్రౌంచ పర్వతమును భేదించి 'క్రౌంచభేదుడ'ని కూడా పిలువబడతాడు. ఆరుతలలు, పన్నెండు చేతులవాడు కనుక 'షణ్ముఖు'డైనాడు. నెమలి వాహనాన్ని ఎక్కి పాము పడగపై నిల్చున్న విగ్రహాలను మనం ఆలయాలలో చూస్తాము. ఇంద్రుని కుమార్తెలైన వల్లీ, దేవసేనలు అతని భార్యలు.

జ్ఞాన సిద్ధి కొరకై ఎంతో కఠోర తపస్సు చేశాడు. అతని చుట్టూ పుట్టలు కట్టి పాములు అందులో నివసించసాగాయి. సంతాన సిద్ధి కోసం భక్తులు అతడిని నాగ దేవతగా ఆరాధిస్తారు.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము - 82వ శ్లోకము

**కస్త్వం బాల బలానుజః**

**కిమిహతే మన్మందిరా శఙ్కయా**

**యుక్తం తన్నవనీత పాత్రవివరే**

**హస్తం కిమర్థం న్యసేః**

**మాతః కఞ్చన వత్సకం మృగయుతం**

**మాగా విషాదం క్షణా**

**దిత్యకం వర వల్లవీ ప్రతివచః**

**కృష్ణస్య పుషాతునః ॥**



తాత్పర్యము -

వెన్న దొంగిలిస్తున్న కృష్ణుణ్ణి చూసి ఒక గోపిక "అబ్బాయీ! ఎవరు నీవు?" అని అడిగింది.

కృష్ణుడు "నేను బలరామయ్య తమ్ముడిని" అన్నాడు

గోపిక "సరేకాని, మరి మా యింటికి ఏల వచ్చితివి?" అన్నది

కృష్ణుడు "ఇది మా యిల్లే అనుకున్నాను" అన్నాడు.

గోపిక "అయితే వెన్న బానలో చెయ్యి ఎందుకు దూర్చావు?" అన్నది.

కృష్ణుడు "మొన్ననే పుట్టిన మా లేగదూడ ఒకటి తప్పిపోయింది. అది యీ బానలో ఏమైనా ఉన్నదేమో అని వెతుకుతున్నాను. కొంచెము సేపు నీవు ఊరకే ఉండు. వచ్చిన దారినే నేను వెళ్ళిపోతానులే" అని బదులిచ్చే శ్రీకృష్ణుడు మమ్మల్ని రక్షించు గాక!

# భ్రమర - కీటక న్యాయం

- పరాశర ప్రసాద్

బుద్ధీంద్రియం రెండు విధాలుగా ఉంటుంది. ప్రాపంచిక వ్యవహారాలలో మునిగి యున్న బుద్ధి స్థూల బుద్ధి. సాపేక్ష అజ్ఞాన జీవితంలో తలమునకలయ్యే సాధారణ వ్యక్తుల బుద్ధి యీ రకమైనదే. వీరు నిగూఢమైన వేదాంత రహస్యాలు అంత సులభంగా అర్థం చేసుకో లేరు. వేదాంత రహస్యాలుగాని, తత్త్వపూరితమైన బోధనిగాని అందుకో గలగటానికి సూక్ష్మబుద్ధి ఆవశ్యకము. సద్గురుమూర్తిని ఆశ్రయించి, వారి అనుగ్రహానికి పాత్రులై, తత్త్వ దృష్టిలో వున్నవారి బుద్ధి సూక్ష్మగ్రాహ్యమైనది. అయితే వేదాంత రహస్యాలు సామాన్య మానవులు కూడా అందుకోగలగటానికి వేదాంత ఉపదేశాలని నిత్యజీవితంలోని ఆచరణీయ నిదర్శనాల ద్వారా తెలియ జేస్తున్నారు సద్గురుదేవులు. అటువంటి నిదర్శనాలలో అతిముఖ్యమైనది భ్రమర కీటక న్యాయము.

భ్రమరము కీటకమును పట్టుకుని తాను మట్టితో తయారు చేసిన గూటిలోకి చేరుస్తుంది. ఆ గూడు చుట్టూ ఝుంకరిస్తూ తిరుగుతూ ఆ కీటకాలకు సర్వకాలసర్వావస్థలయందూ తన ఉనికిని తెలియజేస్తూ వుంటుంది. ఆ కీటకాలు అన్ని వేళలా ఆ భ్రమరంపైనే దృష్టిని నిలిపి అదే ధ్యాసలో ఉండటం చేత తదాకారాన్ని పొంది భ్రమరాలుగా మారిపోతాయి. ఇది ప్రాపంచిక సత్యం. అంటే వ్యావహారిక సత్యం. భ్రమర కీటక న్యాయం సద్గురుమూర్తి జీవుడిని సంస్కరించి ఎలా తనంతటి వాడిగా తయారుచేస్తున్నాడో తెలియజేసే వేదాంత రహస్యం.

సద్గురుమూర్తి భ్రమరంగా వ్యవహరిస్తూ, వాసనతో కూడిన మనస్సు అనబడే జీవుడిని ఒక ఉపాధిలో చేర్చి తన అనుగ్రహ భాషణతో అనేక హెచ్చరికలు చేస్తాడు. ఆ జీవుడు గురుబోధ శ్రవణ మననాల ద్వారా ఉత్తేజితుడై ఆ బోధ జీవుడి మనస్సులో ప్రతిధ్వనిస్తుంది. అప్పుడు తదాకారాన్ని పొందుతాడు. శ్రవణం చేసిన బోధ మనస్సులో ప్రతిధ్వనించాలి అంటే మననము లేక విచారణ చేయాలి. దాని ద్వారా సమాధి స్థితిని పొందుతాడు. సమాధి అంటే సమస్థితి. ఆ స్థితిలో రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలు, సుఖదుఃఖాలు, హెచ్చుతగ్గులు వుండవు. అదే సద్గురుమూర్తి తన శిష్యులనుంచి ఆశించే 'త్వమేవాఽహం' భ్రమరకీటక న్యాయం యొక్క ఆంతర్యం కూడా అదే అని భావించాలి.

# నిజమైన చదువు

-స్వామి రామతీర్థ

ఒక గురువుగారి దగ్గర అనేకమంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వారిలో ఒక రాజకుమారుడు కూడా ఉండేవాడు.

ఒకరోజు గురువుగారు పిల్లలను "నిన్నటి పాఠం వచ్చిందా?" అని అడిగారు. అందరూ వచ్చిందన్నారు. రాకుమారుడు ఏమీ మాట్లాడ లేదు. వానిని చూసి గురువుగారు "మరి నీకో?" అన్నారు.

"నాకు మొదటి వాక్యం బాగా వచ్చిందండీ. రెండో వాక్యం కూడా వచ్చింది. ................" అని ఆగిపోయాడు.

తన శిష్యుడి సోమరితనానికి మండిపడిన గురువు "ఇదేనా నీ చదువు?" అంటూ బెత్తంతో బాగా చితక బాదసాగాడు.

అంతలోనే గురువుగారికి తాను కొడుతున్నది మహారాజు కుమారుడిని అని జ్ఞాపకం వచ్చింది. వీడు తలచుకుంటే నన్ను కొరత కూడా వేయించగలడు అనుకునేసరికి గురువుకు దడ పుట్టుకొచ్చింది.

తరువాత ఆయనకు ఆశ్చర్యం కలిగింది. ఎందుకంటే దెబ్బలు తిన్నప్పటికీ రాజకుమారుడిలో విచారంగాని, బాధకాని లేవు. అతని ముఖం ప్రశాంతంగా ఉంది.

గురువుగారికి ఏం చేయాలో తోచక, "ఏమిటి నీకు వచ్చిన ఆ రెండు వాక్యాలు?" అని ప్రశ్నించాడు.

రాకుమారుడు సమాధానం చెబుతూ "1. క్రోధాన్ని జయించాలి. 2. ఎన్నడూ అబద్ధమాడరాదు" అన్నాడు.

ఈ మాటలు వినగానే గురువుగారికి కూడా కనువిప్పు కలిగింది. తాను గురువైనప్పటికీ ఆ చిన్న కుర్రవాడు నిజమైన చదువేదో తెలుసుకున్నాడు. తాను తెలుసుకోలేదు.

నిజమైన చదువంటే పాఠాలు కంఠస్థం చేయటం కాదు. వాటిని ఆచరణలో పెట్టటం!

# పరమానందయ్య శిష్యులు

- రమణ ప్రసాద్

భగవంతుని అనుగ్రహం పొందటానికి భక్తుడు చూపే నవరసాలలో హాస్య రసం ఒకటి. ఆ హాస్య రసాన్ని చిలికించేవే "పరమానందయ్య శిష్యుల కథలు." వీటిలో



గురువుగారు తన శిష్యులపైన ఎంత వాత్సల్యం చూపిస్తాడో, ఆయన శిష్యులు కూడా గురువాజ్ఞను తు.చ. తప్పకుండా పాటించటానికి ఎప్పుడూ సిద్ధంగా వుంటారు. అయితే ఆ శిష్యులు తెలివితక్కువగా ప్రవర్తించటం వల్ల ఆ ఊరివారు నవ్వుకోవటం వాడుకైంది. వారు చేసే చేష్టలు మనకు కూడా నవ్వు తెప్పించేవిగా ఉంటాయి. ఈ క్రింది కథ ఉపనిషత్కథలలో ఒకటిగా వస్తుంది. దానికి వేదాంత పరంగా ఎంతో అర్థం ఉంది :-

దసరా పండుగలలో చుట్టు పక్కల ఊళ్లవారు పరమానందయ్య గారిని తమ ఊరికి పిలిచి సన్మానించటం పరిపాటి. పరమానందయ్య గారు  ఒక శుభ ముహూర్తంలో తన పన్నెండు మంది శిష్యులతో బయలుదేరారు. శిష్యులంటే వారికి పంచ ప్రాణాలు. అలా  బయలుదేరి ఊరూరు వెళ్తూ వారిచ్చిన సరుకులు, సంబారాలు తీసికొని ప్రయాణం చేస్తున్నారు. ఇంతలో వారికి ఒక ఏరు తగిలింది. అప్పటికి చీకటి పడబోతోంది. యేట్లో దిగుదామంటే ఎంత లోతో తెలియదు.

"గురువుగారూ దీనిని దొంగేరు అంటారు. ఇది అప్పటికప్పుడే పొంగుతుందట"  అన్నాడొక శిష్యుడు. "అయితే ఏరు నిద్ర పోయిన

తరువాత శబ్దం చేయకుండా దాటదాం" అన్నారు గురువుగారు. కొంత సేపు తర్వాత "పదండి" అన్నారు గురువుగారు. అంత "గట్టిగా అరవకండి నది లేవగలదు"అన్నాడొక శిష్యుడు. శిష్యులందరూ ఏటి ఒడ్డుకు చేరారు. "దాటండిరా!" అన్నారు గురువుగారు. "మాకు భయంగా ఉంది. ముందు మీరు దాటండి" అన్నారు శిష్యులు. అందరూ ఏరు దాటారు. ఉన్నట్టుండి ఒక శిష్యుడు గట్టిగా ఏడవటం మొదలు పెట్టాడు.

"ఏమైంది?" అన్నారు గురువుగారు. "మేము పన్నెండు మందిమి కదండీ! గట్టెక్కాక లెక్క చూసుకుంటే పదకొండుమందిమే ఉన్నాం. మాలో ఒకడిని దొంగేరు మింగేసింది" అన్నాడు. గురువుగారు మరో శిష్యుడిని పిలిచి లెక్క పెట్టమంటే, వాడు లెక్కించి,"మాలో ఒకడు తక్కువయ్యాడు" అని ఏడవటం మొదలు పెట్టాడు. పరమానందయ్య గారి భార్య సుందరమ్మగారు అందరినీ వరసలో నిలబెట్టి లెక్కపెట్టి, ''మీతో కలిపి లెక్కించుకోకుండా, మిగిలిన వాళ్లను లెక్క పెడితే ఒకరు తగ్గరట్రా?" అంది. 'అమ్మయ్య!' అని అందరూ ఏడుపు ఆపి బయల్దేరారు.

ఉపనిషత్కథలో పదిమంది శిష్యులు నది దాటినట్లు చెబుతారు. వాళ్ళు,"ఒకడు మునిగిపోయాడు, తొమ్మిది మందిమే ఉన్నాము"అని ఏడుస్తుంటే, ఒక తెలివైనవాడు (జ్ఞాని) వచ్చి, వారందరినీ నుంచోబెట్టి లెక్కించి,"మీలో ఎవరూ మునిగిపోలేదు. అలా అనుకొని ఏడవటం అజ్ఞానం" అని చెబుతాడు. వారందరూ ఆ గురువుగారికి ధన్యవాదాలు తెలుపుతారు. "మన శరీరంలో కాళ్ళు, చేతులు మొదలైన అన్ని భాగాలను లెక్కిస్తాము. కాని మన ఉనికికి కారణభూతమైన ఆత్మను లెక్కించం" అని బోధించాడు.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీ సద్గురు దేవులకు సర్వుల యెడల అనుగ్రహము సమానమే. కాని, వారి వారి విశ్వాసమును, సాధనను, సంస్కారమును అనుసరించి మానవులు ఆ అనుగ్రహ ఫలితాలను అందుకోగలుగుతారు. సూర్యకాంతి సర్వత్ర సమానంగానే ప్రసరిస్తుంది. ఏ ఆచ్ఛాదనా లేకుండ నిలిచిన వారు దానిని పూర్తిగా అందుకోగలుగుతారు. కాని గొడుగులు వేసుకొనో, తలుపులు మూసుకొనో, మరేదైనా ఆచ్ఛాదన పెట్టుకొనో వున్నవారికి సూర్యకాంతి అందలేదంటే, అది సూర్యభగవానుని దోషం కాదు. అలాగే భగవదనుగ్రహము, అంటే ప్రత్యక్ష భగవానుడైన గురుదేవుని అనుగ్రహము. జాతి నీతి కుల గోత్ర భేదాలు లేకుండా అందరిపైనా సమానంగానే వుంటుంది. కాని మానవుడు కామక్రోధాది గుణములు, రాగద్వేషములు, ఈర్ష్యాసూయలు, అహంకార మమకారములు మొదలైన అవలక్షణములతో తన మనస్సును నింపుకొన్నప్పుడు ఆ మనస్సు శ్రీగుర్వనుగ్రహాన్ని అందుకోలేదు. ఒకవేళ అందుకొన్నా, దానిని నిలబెట్టుకోలేదు. కాని చిత్తశుద్ధి, ఆవేదన కలవారు తమ అవలక్షణాలను గురు కటాక్షంతో తొలగించుకొని, గురు కృపకు పూర్ణంగా పాత్రులు కాగలరు.



శ్రీబాబును గురుదేవులుగా విశ్వసించి ఆశ్రయించుకొని, వారికి అత్యంత ప్రీతిపాత్రులై ఎనలేని సేవ చేసుకొని తరించిన కుటుంబాలలో శ్రీ పాలూరి శ్రీరామమూర్తిగారి కుటుంబం ఒకటి.

అప్పట్లో భీమవరం కరణంగారైన శ్రీరామమూర్తిగారు సంపన్న నియోగి బ్రాహ్మణ కుటుంబమునకు యజమాని. వారికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు.

ఆ రోజులలో కరణానికి ఊళ్ళో ఎంతో పలుకుబడి, గౌరవము ఉండేవి. అందులోను శ్రీరామమూర్తిగారంటే జనం మరింత భయభక్తులు

కలిగి ఉండేవారు. వాకిట్లో ఆయన కూర్చుని ఉంటే, ఆ వీధి గుండా వెళ్ళే వారు ఆయనకు నమస్కారం చేసి దూరంగా తప్పుకుని మరీ వెళ్ళేవారు. ఎంతో డాబుగా దర్జాగా గడిచేది ఆయన జీవితం. వారికి శ్రీబాబుతో సాన్నిహిత్యం ఏర్పడిన తరువాత శ్రీబాబు వారిని 'తాతయ్యా' అని పిలిచేవారు. అందువలన శ్రీబాబు భక్తులందరికి 'తాతయ్యగారు' అయినారు.

తాతయ్యగారింటికి ఎదురుగా శ్రీ పరశురామయ్యగారి పెద్ద కుమార్తె సీతమ్మగారు, అల్లుడు చల్లా కృష్ణమూర్తిగారు, వారి ఏకైక కుమారుడు రమణబాబుతో నివసిస్తూ ఉండేవారు. వారికి దగ్గరలోనే కోర్టు అమీనా సుబ్రహ్మణ్యం గారు, వారి ధర్మపత్ని జయమ్మగారు వుండేవారు. మొదట్లో శ్రీబాబు భీమవరం వచ్చినప్పుడు అమీనాగారింటికి వచ్చి కొన్ని రోజులుండి వెడుతూ ఉండేవారు. శ్రీ బాబును గూర్చి సీతమ్మగారు, జయమ్మగారు తాతయ్యగారి యింట్లో చెబుతూ వుండేవారు. తాతయ్యగారికి, కుమారులకు యిటువంటి వాటిపై లక్ష్యం ఉండేది కాదు. కాని మిగిలిన వారందరికి శ్రీ బాబు యెడల అంతో యింతో గౌరవము ఏర్పడింది.

1952వ సంవత్సరంలో ఒకరోజు తాతయ్యగారి పెద్ద కోడలు సీతమ్మగారు తమ వ్యక్తిగత సమస్యలను గూర్చి శ్రీ బాబుకు మనవి చేసుకోవడానికి అమీనా గారింటికి వెళ్ళారు. దుర్గాదేవి భక్తురాలైన సీతమ్మగారికి శ్రీ బాబు దుర్గామాత రూపంలో దర్శనమిచ్చారు. ఆమె ఆశ్చర్యంగా చూస్తుండగానే శ్రీ బాబు , దుర్గామాత మార్చి మార్చి ఆమెకు దర్శనమిచ్చారు. పరమానందంలో మునిగిపోయిన సీతమ్మగారు రెప్ప వాల్చకుండా శ్రీ బాబు వంకనే చూస్తూ మాటిమాటికి చేతులు జోడిస్తూ, తన సమస్యల మాట మర్చిపోయారు. శ్రీ బాబు ఆమెను పలకరిస్తున్నట్లుగానే హెచ్చరిస్తూ 'ఏవమ్మా! నన్ను చూడగానే వచ్చిన పని కూడ మరచిపోయినట్లున్నారే!' అన్నారు. సీతమ్మగారు తెప్పరిల్లుకుని, తమ మనస్సు ఏమీ బాగుండటం లేదని, మనశ్శాంతి కలిగే ఉపాయం ఏదైనా చెప్పమని అడిగారు. ప్రతి శుక్రవారమూ, ప్రతి పూర్ణిమ నాడూ జగన్మాతకు ఐదు రకాల పుష్పాలతో పూజ చేసి, ఒక కొబ్బరికాయ కొట్టి నివేదన చెయ్యమని శ్రీ బాబు ఆమెకు చెప్పారు. ఆ నాటి నుండే సీతమ్మగారి హృదయంలో శ్రీ బాబు దివ్య మంగళ మూర్తి చెరగని ముద్ర వేసుకుంది.

- సశేషం

విష్ణు కథలు

-గత సంచిక తరువాయి

# మీరాబాయి

- రమణ ప్రసాద్

## వైరాగ్యం

"నాకు ఈ ప్రపంచంలో కావలసింది ఏదిలేదు. నా జీవనం నా ప్రభువు కోసమే. నా ప్రభువు నన్ను ఏవిధంగా ఉండమంటే ఆవిధంగా ఉంటాను. హరిగుణ గణాలను కీర్తిస్తాను నాశరీరాన్ని ప్రభువుకే అంకితం చేస్తాను.



కరమగతి టారే నహి టరే ।।

సత్‌బాదీ హరిచంద్ర్, సే రాజా, (సో తో) నీచ్ ఘర్ నీర్ భరే పాంచ్ పాండు అరూ, కుంతీ.ద్రౌపదీ, హాడ్ హిమాలై గరే ।। జగ్యకియో బలీ లేణ్ ఇంద్రాసణ్, సో పాతాళ ధరే।మీరాకే ప్రభుగిరిధర్ నాగర బిఖ్ సే అమృత్ కరే।।

"కర్మయొక్క రాతను తప్పించలేము. సత్యవాది హరిశ్చంద్రుడు అనే రాజు నీచకులం వారి ఇంట్లో నీరు నింపాడు. పంచపాండవులు, కుంతి, ద్రౌపది హిమాలయాలలో వాసం చేయాల్సివచ్చింది. ఇంద్రాసనం కోసం యజ్ఞం చేసిన బలిచక్రవర్తి పాతాళానికి నెట్టివేయబడ్డాడు. కాని మీరాకు ఇచ్చిన విషాన్ని మీరా ప్రభువయిన గిరిధరుడు అమృతంగా చేశాడు."

## దర్శనానందం

జోసీడానే లాఖ్ బథాయిారే, అబ్ ఘర్ ఆయో శ్యామ్।।

ఆజ్ ఆనంద్ ఉమంగి భయోహై, జీబ్ లహై సుఖ్‌ధామ్।

పాంచ్ సఖిమిల్ పీవ్ పరసికై ,ఆనంద్ ఠామూ ఠామ్।।

బిసిర్‌గయీా దుఃఖ్ నిరఖి పియాకూ, సుఫల్ మనోరథ్ కామ్।

మీరాకె సుఖ్‌సాగర్ స్వామీ భవన్ గవన్ కియో।।

"జ్యోతిష్కుడు చెప్పింది నిజమైంది. ఆయనకు అనేక అభివాదములు అర్పిస్తున్నాను. నా శ్యామసుందరుడు నా గృహాన్ని పావనం

చేసాడు. ఈరోజు ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఐదుగురు సఖులు కలిసి నా ప్రియునకు కావలసినవన్నీ అమరుస్తున్నారు. ఎల్లెడలా ఆనందమే ! ఆనందం వెల్లి విరుస్తోంది. ప్రియుని దర్శనం అవగానే నాసంతాపం తీరింది. నా మనోరథం సఫలమైంది. నా స్వామి నా భవనానికి వచ్చేశాడు. మీరా సుఖసాగరంలో మునిగిపోయింది."

మోహనుని రూపం నన్ను పరవశింప చేస్తోంది. సుందర దేహుడు, కమల రేకుల వంటి కన్నులు కలవాడు చిరునవ్వులొలుకుతూ, యమునా తీరంలో ఆవులనుకాస్తూ, తన మురళితో తీయని రాగాలను పలికిస్తూ అలరిస్తున్న గిరిధరుడికి నా తనుమనధనాలను అర్పిస్తున్నాను. ఆయన చరణాలకి మొక్కుతున్నాను."

"శ్యామసుందరా! నా కనుల ఎదుట ఉండిపో. భవసాగరంలో కొట్టుకు పోతున్న నన్ను రక్షించు. నేను నిన్ను కోరేది ఒక్కటే! నీ దర్శనభాగ్యం నాకు ఎప్పుడూ కలిగేటట్లుచెయ్యి. కనిపించినట్లే కనిపించి వెళ్ళిపోకు!"

## నామమహిమ

మేరొమన్‌రామహి రామరట్టైరే॥
రామ్‌నామ్ జప్‌లీజై ప్రాణీ కోటికే పాప్‌కట్టైరే।
జనమ జనమకే ఖత్ జు పురానే, నామ్ హి లేత్ ఫట్టైరే॥
కనకకటోరే అమ్రుత భరియో, పీవతకౌన్ నట్టై రే।
మీరాకహే ప్రభుహరి అబినాశీ, తన్-మన్‌తాహి పట్టై రే ॥

నా మనస్సు రామా! రామా! అని రామనామాన్నే జపిస్తోంది. రామనామాన్ని జపిస్తే కోట్లాది పాపాలు పోతాయి. జన్మజన్మలనుండి వచ్చిన ప్రారబ్ధకర్మలు 'రామ' అనగానే నశిస్తాయి. జనులారా! త్వరపడండి! బంగారుపాత్ర నిండా అమృతం ఇచ్చి త్రాగమంటే ఎవరైనా నిరాకరిస్తారా? అవినాశి అయిన ఆ హరినామం తనువును మనస్సును నిర్మలం చేసి మనసును తరింపచేస్తుంది."

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL